సాక్షి మహబూబ్‌నగర్

శుక్రవారం । 27 । జూన్ । 2025



.. మోక్షం కలగలే!

వేముల-లక్ష్మీపల్లి డబుల్ రహదారి పనులు ఎనిమిదేళ్లుగా పూర్తి కాలేదు.

వివరాలు 8లో ▸



..అవగాహన లేని ప్రభుత్వం

ప్రాజెక్టుల నిర్వహణపై ప్రభుత్వానికి అవగాహన లేదని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.4 /21.6

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

కృష్ణాబేసిన్‌లో తెలంగాణ తొలి ప్రాజెక్టు.. ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయిని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు మరమ్మతుపై అంతులేని నిర్లక్ష్యం వెంటాడుతోంది. ఫలితంగా ప్రాజెక్టు ఆయువుపట్టుగా నిలిచే క్రస్ట్‌గేట్ల ఇనుప రోప్‌లు ఒకదాని తర్వాత మరొకటి తెగిపోతున్నాయి. ఇది వరకే 8 గేట్ల వద్ద ఇనుప రోప్‌లు తెగిపోగా.. తాజాగా 4, 36వ గేట్లకు **సంబంధిం**చిన రోప్‌లు తెగిపోవడం ఆందో**ళన కలిగి**స్తోంది. ఇంత జరుగుతున్నా.. **అధికారులు** మాత్రం తాత్కాలిక మరమ్మతు**లతోనే** సరిపెడుతున్నారు.

– గద్వాల/**అమరచింత**



జూరాల 31వ గేటు వద్ద లీకేజీ



27వ గేటు వద్ద లీకేజీ..

నిర్లక్ష్యమేలా..?

ప్రమాదంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు

- మరమ్మతుకు నోచుకోని ఆనకట్ట క్రస్ట్‌గేట్లు
- ఒకదాని తర్వాత మరొకటి తెగిపోతున్న గేట్ల ఇనుప రోప్‌లు
- 'సాక్షి' ముందే హెచ్చరించినా స్పందించని యంత్రాంగం
- తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్న వైనం
- భారీ వరదలు వస్తే ప్రమాదం తప్పదంటున్న సమీప గ్రామాల ప్రజలు

గ్రాండ్ రిపోర్ట్

జూరాల ప్రాజెక్టులోని మొత్తం క్రస్ట్‌గేట్లకు రబ్బర్ సీల్స్, రోప్స్, పేయింటింగ్, సాండ్ బ్లాస్టింగ్, గేట్ల స్ట్రైన్తెనింగ్ వంటి మరమ్మతుల కోసం మూడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రూ.11 కోట్లు విడుదల చేసింది. అయితే నాటి నుంచి కేవలం 23శాతం పనులను మాత్రమే పూర్తిచేశారు. తాజాగా వరదలు మొదలయ్యే సమయంలో క్రస్ట్‌గేట్లకు ఉన్న ఇనుప రోప్‌లు తెగిపోతుండటంతో ప్రాజెక్టు మనుగడపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. దీనిపై గతంలోనే పలుమార్లు 'సాక్షి' వరుస కథనాలతో హెచ్చరించినా..అధికార యంత్రాంగం స్పందించలేదు. జూరాల ప్రాజెక్టు మరమ్మతుపై నిర్లక్ష్యం వీడ లేదు.

లీకేజీల మయం..

ఇప్పటికే ప్రాజెక్టులోని 18 గేట్ల వద్ద రబ్బర్ సీల్, ఇనుప రోప్‌లు దెబ్బతిన్నాయి. అందులో 8, 12, 19, 21, 25, 27, 50 నంబర్ గేట్లతో పాటు మరికొన్నింటి నుంచి నీరు నిత్యం లీకేజీ అవుతోంది. అయినప్పటికీ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఎగువ నుంచి వరద రావడం.. ప్రాజెక్టులోని మరో రెండు గేట్ల వద్ద ఇనుప రోప్‌లు తెగిపోవడంతో ఎప్పుడేం జరుగుతుందోనని సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.



12వ గేట్ నుంచి లీకేజీ అవుతున్న నీరు

తాత్కాలిక మరమ్మతు మాత్రమే..

1996లో ప్రాజెక్టును వినియోగం**లోకి తీసు**కొచ్చారు. నాటి నుంచి **ప్రాజెక్టులో**ని గేట్లకు చిన్నచిన్న **మరమ్మతు** మాత్రమే చేస్తూ వస్తు**న్నారు.** ఈ రెండున్నర దశాబ్దాల కాలంలో ప్రాజెక్టు మొత్తం గేట్లకు పూర్తిస్థాయి మరమ్మతు చేసిన దాఖలాలు లేవు. ప్రాజెక్టు చరిత్రలోనే అత్యధికంగా 2009లో 12 లక్షల క్యూసెక్కుల పైగా వరద రాగా.. ప్రాజెక్టులోని మొత్తం గేట్లు ఎత్తి నీటిని దిగువనకు విడుదల చేశారు. ఈ క్రమంలో గేట్లు దెబ్బ తినకుండా కాపాడుతున్న రబ్బర్ సీల్, ఇనుప రోప్స్ కొంత మేర దెబ్బతిన్నాయి. అయితే వీటికి పూర్తిస్థాయిలో అవసరమైన మరమ్మతు చేయాల్సిన అధికారులు.. తాత్కాలిక పనులతోనే సరిపెడుతూ వస్తున్నారు.

దేశంలోనే ఎక్కువ బ్లాకులు ఉన్న ప్రాజెక్టు ఇదే..

64 రేడియల్ క్రస్ట్‌గేట్లతో కలిపి 84 బ్లాకులు ఉన్న ప్రాజెక్టు దేశంలోనే మొదటిది. జూరాల ప్రాజెక్టుకు వరద వచ్చినప్పుడు 64 క్రస్ట్‌గేట్లను ఆపరేట్ (పైకెత్తడం)తో నీరు సులభంగా దిగువకు వెళ్లేలా నిర్మించారు. గేట్లు అర్ధచంద్రాకారంలో ఉంటాయి. గేట్లను పైకి, కిందకి ఆపరేట్ చేసేందుకు గేట్ల ఇరువైపుల రెండు రబ్బర్ సీల్స్, అడుగుభాగాన ఒక రబ్బర్‌సీల్ ఉంటాయి. క్రస్ట్‌గేట్లను ఆపరేట్ చేసేందుకు అవసరమైన ఇనుప రోప్‌లు గేటుకు ఇరువైపులా రెండు, అడుగు భాగాన రెండు ఉంటాయి. ఈ తరహా టెక్నాలజీని తొలిసారిగా జూరాల ప్రాజెక్టులో వినియోగించినట్లు అధికారులు చెబుతారు. వీటి సాయంతోనే మొత్తం రేడియల్ క్రస్ట్ గేట్లను అవసరమైనప్పుడు పైకి ఎత్తడం, దించడం వంటి ప్రక్రియ చేపడతారు.



జూరాల ప్రాజెక్టు 4వ నంబర్ గేటు వద్ద తెగిన ఇనుప రోప్

18 ఏళ్ల కాలంలో తొలిసారిగా ప్రాజెక్టుకు ఈసారి మే నెలలోనే వరద మొదలైంది. ప్రస్తుతం ఎగువ నుంచి ఒక లక్షకు పైగా క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండటంతో 12 గేట్లు ఎత్తి దిగువనున్న శ్రీశైలం వైపు విడుదల చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దెబ్బ తిన్న గేట్లలో రెండు గేట్ల ఇనుప రోప్‌లు తెగిపోయాయి. 2009 మాదిరిగా జూరాలకు భారీ వరద వస్తే.. ఇటీవల కర్ణాటకలోని టీబీ డ్యాం గేటు, విజయవాడలోని కృష్ణా బ్యారేజీ గేట్లలా కొట్టుకుపోయే ప్రమాదం లేకపోలేదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి మొత్తం గేట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతు చేయించాల్సిన అవసరం ఉంది.

లక్ష క్యూసెక్కులకే..

'సాక్షి' ముందే హెచ్చరించింది..

ప్రాజెక్టు గేట్లకు సంబంధించి ఇనుప రోప్‌లు, రబ్బర్ సీల్, కలరింగ్ వంటి మరమ్మతులతో 18 గేట్లు దెబ్బతిన్నాయని 'సాక్షి' వరుస కథనాలతో అధికారులను హెచ్చరించింది. మూడేళ్లుగా మరమ్మతు పనులు పూర్తిచేయకుండా నత్తకు నడక నేర్పుతున్న వైనాన్ని ఎండగట్టింది. డ్యాం పై భాగాన ఉన్న హాయిస్ట్ బ్రిడ్జి, గేట్ల వద్ద ఉన్న వాక్‌వే బ్రిడ్జికి సంబంధించి సాండ్ బ్లాస్టింగ్ పనులు పూర్తిచేశారు. ఇప్పటి వరకు కేవలం 23శాతం పనులు మాత్రమే పూర్తి చేశారంటే పనుల పురోగతి ఎంత వేగంగా సాగుతుందో స్పష్టమవుతోంది.



పొంచి ఉన్న ముప్పు..



జూరాల ప్రాజెక్టుకు అత్యంత సమీపంలో మా గ్రామం ఉంటుంది. 2009 భారీ వరదల్లో పంట పొలాలు మునిగిపోవడంతో పాటు గుడిసెలు, పశుగ్రాసం నీటిలో కొట్టుకుపోయాయి. అప్పటి వరద ప్రవాహాన్ని చూసి భయపడ్డా. ఇప్పుడు క్రస్ట్‌గేట్ల ఇనుప రోప్‌లు తెగిపోయిందంటున్నారు. గేట్లు కొట్టుకుపోతే మా గ్రామం నీటిలో మునిగిపోవడం ఖాయం. ప్రభుత్వం చొరవ చూపి ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలి.

– అలంపూర్ ఆశన్న, నందిమళ్ల

గొర్రెలు కొట్టుకుపోయాయి..



2009లో వచ్చిన భారీ వరదలతో మూలమళ్ల గ్రామం అతలాకుతలం అయింది. భయంతో జనం పరుగులు తీశారు. నేను గొర్రెలను మేత కోసం నది సమీపంలోకి తీసుకెళ్లగా.. వరద నీటిలో చిక్కుకుని కొట్టుకుపోయాయి. ఇలాంటి ఘటనలు మరోమారు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బీసన్న, మూలమళ్ల

ప్రభుత్వ నిర్లక్ష్యమే..



జూరాల ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు దెబ్బతిన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రాజెక్టు నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాంట్రాక్టర్ సకాలంలో పనులు చేయకపోయినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. క్రస్ట్‌గేట్ల రూప్‌లు తెగినా పట్టించుకోని స్థితిలో ప్రాజెక్టు అధికారులు ఉండటం దారుణం.

– చింతలన్న, నందిమళ్ల

ముందస్తు వరదతో పనులకు అడ్డంకి..



ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లకు మరమ్మతు చేసేందుకు మూడేళ్ల క్రితం రూ.11కోట్ల నిధులు వచ్చాయి. 2022లో పనులు కొంతమేర వేగవంతంగా జరిగాయి. 2023లో గ్యాంటీ క్రేన్‌కు సమస్య తలెత్తడంతో పనులకు ఆటంకం ఏర్పడింది. క్రస్ట్‌గేట్ల ఇనుప రోప్‌లు తెగిపోయిందన్న మాట వాస్తవం కాదు. ఇది వరకే ఎనిమిది గేట్లకు సంబంధించి మరమ్మతులు మొదలుపెట్టాం. అయితే ముందస్తు వరద రావడంతో పనులకు అడ్డంకిగా మారింది. ప్రస్తుతం ప్రాజెక్టుకు ఎలాంటి ప్రమాదం లేదు. మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేస్తాం.

– రహీముద్దీన్, ఎస్ఈ, ఇరిగేషన్‌శాఖ

న్యూస్‌రీల్

36 గంటల పాటు భగీరథ నీళ్లు బంద్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఈనెల 27వ తేదీ రాత్రి 8 గంటల నుంచి ఈనెల 29వ తేదీ ఉదయం 8 గంటల వరకు మిషన్ భగీరథ నీళ్ల సరఫరాను నిలిపివేయనున్నట్లు భగీరథ గ్రిడ్ ఈఈ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మన్యంకొండ నుంచి నారాయణపేటకు పోయే మార్గంలో మరికల్ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలు అవుతున్నందున వాటికి తొలగించి కొత్త పైప్‌లైన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ మరమ్మతుల పనుల ప్రభావం వల్ల మన్యంకొండ నీటి శుద్ధి కేంద్రం నుంచి నీటి సరఫరా అయ్యే దేవరకద్ర, నారాయణపేట, మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మూడు మున్సిపాలిటీలు, 245 గ్రామాల పరిధిలో 36 గంటల పాటు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రజలందరూ సహకరించగలరని కోరారు.

ముమ్మరంగా '100 రోజుల ప్రణాళిక'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలో '100 రోజుల ప్రత్యేక కార్యాచరణ'ను పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్ టి.ప్రవీణ్‌కుమారెడ్డి ఆదేశించారు. గురువారం రవీంద్రనగర్‌లో కొనసాగుతున్న ఈ కార్యక్రమాన్నిక్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ముఖ్యంగా ప్రజలకు తడి, పొడి చెత్త వేరు చేసిన తర్వాతే స్వచ్ఛ ఆటోలను ఇవ్వాలని అవగాహన కల్పించాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను వినియోగించొద్దని, సీజనల్ వ్యాధుల నివారణకు అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, నగరంలోని 51 డివిజన్ల పరిధిలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఈనెల 2 నుంచి ముమ్మరంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయా వీధుల్లో డ్రెయినేజీలను శుభ్రం చేయడమే గాక దోమల నివారణకు ఫాగింగ్ చేపడుతున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బుట్టా వేదవ్రత్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ వజ్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కజొన్న @ రూ.2,323

జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్ యార్డులో గురువారం మొక్కజొన్న క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,323, కనిష్టంగా రూ.1,868 ధర లభించింది. ఆముదాలు గరిష్టంగా రూ.6,451, వేరుశనగా గరిష్టంగా రూ.3,061, ధాన్యం హంస గరిష్టంగా రూ.1,742, ఆర్ఎన్ఆర్ గరిష్టంగా రూ.2,112 ధరలు పలికాయి.

డ్రగ్స్ కట్టడికి అందరూ సహకరించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి, చిత్రంలో కలెక్టర్ విజయేందిర

- జిల్లా స్టేడియం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ
- హాజరైన జిల్లా న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీ

పాలమూరు: విద్యార్థి దశలో ఉన్న యువత డ్రగ్స్‌కు అలవాటు పడకుండా, డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలను పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్‌శాఖ, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి జిల్లా స్టేడియం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి పాపిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా డ్రగ్స్ వినియోగం అరికట్టేందుకు పోలీస్‌శాఖకు, ఇతర యంత్రాంగానికి సహకరించాలన్నారు. ఇలా ఈ ఒక్కరోజు మాత్రమే కాకుండా నిత్యం డ్రగ్స్‌పై నిఘా పెట్టాలని సూచించారు. కలెక్టర్ విజయేందిర మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల బారినపడి జీవితాలు, భవిష్యత్ నాశనం చేసుకోరాదని సూచించారు. పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖలు పూర్తి సమన్వయంతో డ్రగ్స్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే కళాశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ప్రారంభించారని, డ్రగ్స్ రవాణాపై ఎలాంటి సమాచారం ఉన్న డయల్ 100, 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ డ్రగ్స్ కట్టడికి పోలీస్ శాఖ నిత్యం పోరాటం చేస్తోందని, యువత సైతం ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలన్నారు. అంతకుముందు స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను అధికారులు తిలకించారు. అలాగే 'సే నో టూ డ్రగ్స్- ఎస్ టు లైఫ్' అనే ప్రతిజ్ఞ బోర్డుపై అందరూ సంతకాలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, మహిలా శిశు సంక్షేమ శాఖ అధికారిని జరీనా, న్యాయమూర్తి ఇందిర, డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ, డీఈఓ ప్రవీణ్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో భోజనం బాగోలేదు

- పరిసరాలు శుభ్రంగా ఉంచుకోకపోతే ఎలా?
- నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ విజయేందిర బోయి



మధ్యాహ్న భోజనం వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

గండేడ్: 'భోజనం బాగోలేదు.. గుడ్డు పెట్ట లేదు.. కనీసం పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచుకోపోతే ఎలా?' అంటూ కలెక్టర్ విజయేందిర బోయి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆమె గండేడ్ మండలం సల్కర్‌పేట అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి చిన్నారులకు అందించే పోషకాహారం, మెనూ గురించి ఆరా తీశారు. మెనూ పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో 1, 2, 3 తరగతి గదుల్లో బోధనను పరిశీలించారు. మూడో తరగతిలో ఉపాధ్యాయులు గణితం బోధిస్తుండగా విద్యార్థుల వద్దకు వెళ్లి కూడికలపై ప్రశ్నలు వేశారు. ఒకటో తరగతి విద్యార్థులతో అక్షర మాల చదివించారు. ప్రాథమిక భావనలు, కొత్త పదాలు నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఉన్నత పాఠశాలలోకి వెళ్లి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. భోజనం నాసిరకంగా ఉందని, చారు నీళ్లలాగా పెడితే విద్యార్థులు ఎలా తింటారని ఏజెన్సీ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయి, పరిహారం అందని రంగారెడ్డిపల్లి, సల్కర్‌పేట్ రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా భూమి ఎక్కువ ఉంటే పరిహారం తక్కువ వచ్చినట్లు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతోపాటు పరిహారం మొత్తాన్ని కూడా పెంచాలని కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు అన్ని విషయాలు పరిశీలిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరావు, ఆర్ఐ యాసిన్, జితేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అనుమానితులందరికీ సై-టీబీ పరీక్షలు

పాలమూరు: ప్రస్తుతం కొత్తగా అందుబాటులోకి వచ్చిన సై-టీబీ పరీక్షలను అనుమానితులకు అందరికి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ అన్నారు. పాత డీఎంహెచ్ఓ కార్యాలయంలో గురువారం సై-టీబీ పరీక్షల నిర్వహణపై మెడికల్ ఆఫీసర్లకు, ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీబీ అనుమానితులకు తేమడ పరీక్ష, ఎక్స్‌రే చేయడం జరిగిందని ఇకపై వీటితో పాటు సై-టీబీ పరీక్షలు సైతం నిర్వహించాలన్నారు. కొత్తగా వచ్చిన ఈ పరీక్షపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శశికాంత్, మల్లిఖార్జున్, పద్మజా, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి 'స్పోర్ట్స్ స్కూల్' ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: స్పోర్ట్స్ స్కూళ్లలో 4వ తరగతిలో ప్రవేశాల కోసం గురువారం జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో ఎంపికలు ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బాలబాలికలు హాజరయ్యారు. విద్యార్థుల పేర్లు నమోదు చేయడంతో పాటు ఎంపికల్లో పొందుపరిచిన విధంగా వయసు నిర్ధారణ ధ్రువీకరణ, ఇతర పత్రాలను పరిశీలించారు. ఎత్తు, బరువు, ఫ్లెక్సిబిలిటీ, వర్టికల్ జంప్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, మెడిసన్ బాల్‌త్రో, 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, 6X10 మీటర్ల షటిల్ రన్, 800 మీటర్ల రన్నింగ్ అంశాల్లో పరీక్షలు నిర్వహించారు. ఎంపికలను జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ పర్యవేక్షించారు. జిల్లాస్థాయి ఎంపికల ఫలితాలు త్వరలో విడుదల చేస్తామని ఆయన తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులు హైదరాబాద్‌లో వచ్చేనెల 4, 5 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో శాట్ పరిశీలకుడు కె.సైదులు, సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, కోచ్‌లు సునీల్‌కుమార్, ఎండీ ఖలీల్, పర్వేజ్ పాష, నికేష్, అంజద్, మల్లేష్, కంప్యూటర్ ఆపరేటర్ ఉమేష్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.



పనిలో నైపుణ్యం సాధించాలి: ఎమ్మెల్యే యెన్నం



మెప్మా భవనంలో మహిళలకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రతి ఒక్కరూ తాము చేసే పనిలో నైపుణ్యం సాధించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని మెప్మా భవనంలో ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌జీలకు కొన్ని రోజులుగా 'నవరత్నాలు' ఆధ్వర్యంలో సెట్విన్ సహకారంతో ఉచిత కంప్యూటర్ శిక్షణనిస్తున్నారు. గురువారం వారికి ఎమ్మెల్యే స్టడీ మెటీయల్ అందజేసి మాట్లాడారు. రానున్న రోజుల్లో మహిళా సంఘాల నిర్వహణ కంప్యూటరీకరించనున్నారని, ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతకు ముందు ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించిన అప్రెంటిస్‌షిప్-జాబ్‌మేళాకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు పవన్, పావనిలను ఘనంగా సన్మానించారు. ముఖ్యంగా ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు చేపట్టే ఇంటర్వ్యూలలో ఎక్కువ మంది విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న జి.అరుణ కోసం రూ.50 వేలు, తస్లీం బేగం కోసం రూ.2.50 లక్షల విలువైన ఎల్‌ఓసీలు ఆయా కుటుంబసభ్యులకు క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రీ, ఖాజాపాషా, బొట్టు శ్రీను, రాష్ట్ర పరిశీలకులు నందూరి శ్రీనివాస్, మహబూబ్‌నగర్ ఫస్ట్-నవరత్నాలు పర్యవేక్షకులు గుండా మనోహర్, సెట్విన్ కో-ఆర్డినేటర్ విజయ్‌కుమార్, ఫ్యాకల్టీ రోజారాణి, కళాశాల ప్రిన్సిపాల్ భగవాణి నర్సింహులు , తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రం



తెలంగాణ చౌరస్తాలో జరిగిన ధర్నాలో పాల్గొన్న రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుసునీతారావు, జిల్లా అధ్యక్షురాలు వసంత, తదితరులు

- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం.సునీతారావు
- జిల్లాకేంద్రంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజా సంక్షేమాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విస్మరిస్తోందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం.సునీతారావు విమర్శించారు. జిల్లాకేంద్రంలో జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జైబాపు జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమం చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా తెలంగాణ చౌరస్తా వరకు చేరుకొని సిలిండర్లను ప్రదర్శించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు మాట్లాడుతూ మహిళల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సామాన్యుడి నడ్డివిరిచే విధంగా సిలిండర్ ధర 50 రూపాయలు పెంచారని విమర్శించారు. చీరలు, చిన్నారులు ఉపయోగించే పెన్సిళ్లు, పాలపై కూడా కేంద్రం జీఎస్‌టీ విధిస్తోందని విమర్శించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కు గ్యాస్ సిలిండర్, సన్న వడ్లకు రూ.500 బోనస్, రైతు భరోసా అందిస్తున్నట్లు తెలిపారు. పేదలకు అందుబాటులో ఉండే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, జిల్లా ఇన్‌చార్జీలు సుకన్య, వెంకటసుబ్బమ్మ, అరుణ, జిల్లాలోని పట్టణ అధ్యక్షులు, మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు మాట్లాడుతూ ఈ రోజు రాష్ట్రంలో మహిళా కాంగ్రెస్ విభాగం ఎంతో పటిష్టంగా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేసే దిశగా పనిచేయాలని సూచించారు. అనంతరం స్థానిక మోనప్పగుట్టలో సునీతారావు, తదితరులు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యంతో భోజనం చేశారు.

క్లుప్తంగా

వృద్ధుడి మృతి.. బాధితుల ఆందోళన

గట్టు: మండలంలోని సల్కాపురం క్రషర్ వద్ద తారాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు (63) భోజనం చేసిన అనంతరం అకస్మాత్తుగా మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఆంజనేయులు గురువారం సల్కాపురం గ్రామానికి వెళ్లి ఫించన్ డబ్బులు తీసుకున్న అనంతరం గ్రామానికి బయలుదేరి మార్గమధ్యంలో జోకస్ గట్టు క్రషర్ మిషన్ దగ్గరకు చేరుకున్నాడు. అక్కడే పనిచేసే కార్మికులతో కలిసి భోజనం చేసి కిందపడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని క్రషర్ నిర్వాహకుడితో వాగ్వాదానికి దిగారు. భోజనం చేసిన మిగతా వారికి ఏం కాకుండా తమ తండ్రి మాత్రమే ఎందుకు చనిపోయాడని నిలదీశారు. మృతదేహాన్ని క్రషర్ ఎదుట ఉంచి నష్ట పరిహారం చెల్లించాలంటూ ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లేష్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రాత్రి 8 గంటల సమయంలోనూ ఆందోళన కొనసాగుతూనే ఉంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఎర్రవల్లి: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీ తెలిపిన వివరాలు.. వల్లూరు గ్రామా నికి చెందిన గోపాల్(73)పై ఈ నెల 6న పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. కు టుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపా రు. మృతుడి మనుమడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుమార్తెపై తండ్రి లైంగిక దాడి

- 14 రోజుల రిమాండ్

గోపాల్‌పేట: కన్న కూతురుపై తండ్రి లైంగిక దాడికి యత్నించిన ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రజిత కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామంలో ఓ ఇంట్లో తల్లి, తండ్రి, ఇద్దరు కుమార్తెలు ఉంటున్నారు. పెద్ద కుమార్తె ఇటీవలే ఇంటర్ పూర్తి చేసింది. నెలరోజులుగా ఆ బాలికని తండ్రి లైంగికంగా వేధిస్తున్నాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లైంగిక దాడికి యత్నించగా విసిగిపోయిన బాలిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అదేరోజు రాత్రి కేసు నమోదు చేసి తండ్రిని గురువారం వనపర్తి కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి అతడికి 14 రోజులు రిమాండ్ విధించి మహబూబ్‌నగర్ జైలుకు తరలించారు.

అధిక ఫీజులు వసూలు చేయొద్దు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వివిధ ప్రైవేట్ విద్యా సంస్థలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాధికారులు పట్టించుకోవడం లేదని మాలల చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మూలె కేశవులు ఆరోపించారు. అధిక ఫీజులకు నిరసనగా గురువారం స్థానిక బాయ్యతోటలోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీ గేటు ఎదుట కొద్దిసేపు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలల యాజమాన్యం తెచ్చిన బుక్స్, టై, బెల్టులనే తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తేవడం తగదన్నారు. కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో అనుభవం లేని ఉపాధ్యాయులు, అధ్యాపకులకు తక్కువ వేతనాలు ఇస్తూ ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యాటారం చెన్నయ్య, పత్తి యాదయ్య, బి.వెంకట్రాములు, జి.యాదగిరి, ఎం.ఎం.ప్రసాద్, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ సామగ్రి ధ్వంసం

తెలకపల్లి: మండలంలోని ఇటీవల సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి 18420 నల్లబెల్లం, 935 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. గురువారం వాటిని పోలీసులు ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అధికారి గాయత్రి తెలిపారు. ట్రాక్టర్‌లో తీసుకెళ్లి క్వారీలో వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు జనార్దన్, సుజన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిదేళ్లయినా మోక్షం కలగలే..


వేముల సమీపంలో కంకర వేసిన రోడ్డు

- ఎన్‌హెచ్‌ఏ 44 టు ఎన్‌హెచ్‌ఏ 167 డబుల్ రోడ్డు అనుసంధానం పనులకు గ్రహణం
- 2017 లో రూ. 23.36 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రం నుంచి 17 కిలోమీటర్లతో 44 వ జాతీయ రహదారిని అనుసంధానం చేసే లక్ష్మీపల్లి, వేముల డబుల్ రోడ్డు పనులు ఎనిమిదేళ్లైనా పూర్తి కాలేదు. డబుల్ రోడ్డు పనులకు శంఖుస్థాపన చేయడంతో పాత రోడ్డుకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టట్లేదు. దీంతో రోడ్డంతా గుంతలమయంగా మారడంతో వాటిని తప్పించబోయి ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. చిన్న కార్లు ఆ రోడ్డుపై వెళ్లలేక పలుమార్లు గుంతల్లో ఇరుక్కున్న ఘటనలు ఉన్నాయి.

4 కిలోమీటర్లు పూర్తి

గత ప్రభుత్వ హయాంలో 44వ జాతీయ రహదారి వేముల స్టేజీ నుంచి వేముల, లక్ష్మీపల్లి, హాజిలాపూర్, చౌదర్‌పల్లి మీదుగా 167వ జాతీయ రహదారిని కలుపుతూ చౌదరపల్లి స్టేజీ వరకు 17 కిలోమీటర్ల డబుల్ రోడ్డు వేసేందుకు రూ. 23.36 కోట్లు మంజూరు చేశారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించారు. వేముల స్టేజీ నుంచి వేముల గ్రామం వరకు, అక్కడి నుంచి లక్ష్మీపల్లి వరకు 4 కిలో మీటర్ల మేర డబుల్ రోడ్డు పనులు పూర్తి చేశారు. అది కూడా మధ్యలో బీటీ వేయకుండ కొన్ని చోట్ల కంకర వేసి వదిలేశారు. మిగతా 13 కిలోమీటర్ల మేర పనులు ప్రారంభం కాలేదు. చేసిన పనికి సరిగ్గా బిల్లులు రాకపోవడం వల్లనే పనులు నిలిచినట్లు వినిపిస్తున్నా.. ఆర్అండ్‌బీ అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదు.

మరమ్మతు కరువు

డబుల్ రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించడంతో పాత రోడ్డు మరమ్మతులు కూడా చేపట్టలేదు. దీంతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. డబుల్ రోడ్డుతో వేస్తే అంతా సర్దుకుంటుందని భావించిన అధికారులు ఏళ్ల తరబడి మరమ్మతులపై దృష్టి సారించడం లేదు. డబుల్ రోడ్డు వేయకపోయినా పర్లేదు కానీ రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చండి మహాప్రభో అని వాహనదారులు అధికారులను వేడుకుంటున్నారు.


హజిలాపూర్ నుంచి లక్ష్మీపల్లి వెళ్లే రహదారి..

అధికారులు ఇప్పటికైనా రీటెండర్లు వేసి పనులు పూర్తి చేస్తే వాహనదారుల ఇబ్బందులు తప్పుతాయని పలువురు అంటున్నారు.

మరమ్మతులు చేపట్టండి



చౌదర్‌పల్లి గేట్ నుంచి లక్ష్మీపల్లి మీదుగా వేముల స్టేజీ సమీపంలో 44వ జాతీయ రహదారి వరకు కనీసం రోడ్డును మరమ్మతు అయినా చేపట్టాలి. గుంతల రోడ్డుపై ఏళ్ల తరబడి ఈ రోడ్డుపై ప్రయాణించలేక పోతున్నాం. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలన్నీ పూడ్చి వేయాలి.
–అమరేందర్‌రెడ్డి, లక్ష్మీపల్లి.

ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డుపై వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుకు పదేళ్ల క్రితం మరమ్మతు చేపట్టారు. అప్పటి నుంచి మళ్లీ ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. డబుల్ రోడ్డు వేస్తారని ఎనిమిదేళ్లుగా ఎదురు చూస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో నిలిచిన పనులను తిరిగి ప్రారంభించాలి.
– రామాంజనేయులు, లక్ష్మీపల్లి

ప్రాజెక్టుల నిర్వహణపై అవగాహన లేని ప్రభుత్వం


జూరాల ప్రాజెక్టుపై మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఆవంచ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

అమరచింత: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం మాజీ మంత్రి ఆవంచ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి జూరాల ప్రాజెక్టు ప్రధాన గేట్లును పరిశీలించి మాట్లాడారు. 4, 31వ గేట్ల రోప్‌లు రెండు వైపులా తెగిపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అన్నారు. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురిసి జలాశయానికి వస్తున్న వరదను దిగువకు వదిలే పరిస్థితులు లేకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు కొత్త ప్రాజెక్టులు నిర్మించి ప్రతి ఎకరాకు సాగునీరు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. వేసవిలోనే ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు, గ్రీస్ పూయడం, రోప్‌లు సరిచేయడం వంటి పనులకు నిధులు మంజూరు చేయడంతో పాటు ప్రాజెక్టులు సందర్శించి అధికారులతో పనులు చేయించే సత్తా గత ప్రభుత్వానికే ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి ప్రాజెక్టుల మరమ్మతులు, నిర్వహణలపై ఏ మాత్రం అవగాహన లేదని.. అందుకే ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు. వరద నీటిని ఎలా వినియోగించుకోవాలన్న ఆలోచన సైతం లేదన్నారు. జూరాల మరమ్మతులో జరిగే అలసత్వంపై నీటిపారుదలశాఖ మంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

నిర్వాసితులకు అండగా ఉంటా


నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ: మండలంలని సిర్సనగండ్ల సీతారామచంద్రాస్వామి దేవాలయం స్థలంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు అండగా ఉంటానని అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సిర్సనగండ్లలో బాధితులను ఆయన కలిసి ఓదార్చారు. కూల్చిన ఇళ్లను పరిశీలించారు. అనంతరం నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాదాయ శాఖ సంబంధిత అధికారులు కోర్టుకెళ్లడంతో కోర్టు ఉత్వర్వుల మేరకు ఇళ్లు కూల్చారని వివరించారు. కాని కొంత మంది బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధికోసం ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నించడం సిగ్గుచేటన్నారు. ఇళ్లు కోల్పోయిన వారందరికి స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ స్థలంలో నిర్వాసితులకు స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్ సునీతకు సూచించారు. సిర్సనగండ్ల శివారులో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. అంతకుముందు గుట్టపై సీతారామచంద్రాస్వామి స్వాములవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, వెంకట్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, మాజీ సర్పంచ్ ప్రశాంత్ నాయక్, మాజీ జెడ్పీటీసీ భీముడు నాయక్, డీసీసీ కార్యదర్శి మహేదంర్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి జైపాల్, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు సందీప్‌రెడ్డి, శ్రీపతి రావు, వెంకటయ్య గౌడ్, నాగేంద్ర, అంజయ్య, అధికారులు తదితరులు ఉన్నారు.

భూమి అక్రమంగా విరాసత్ చేశారని..



తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేస్తున్న రిజ్వాన

- పెట్రోల్ పోసుకొని మహిళ ఆత్మహత్యాయత్నం
- తహసీల్దార్ కార్యాలయంలో ఆందోళన
- అడ్డుకున్న ఉండవెల్లి రెవెన్యూ సిబ్బంది

ఉండవెల్లి: ''మా చిన్నాన్నను చిన్నమ్మ వదిలిపెట్టి వెళ్తే నేనే సేవచేశా.. అందుకు ఆయన కృతజ్ఞతగా తన పేరుపై ఉన్న భూమిని నాకు రాసిచ్చారు.. ఆ భూమిపై ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తుంది. తీరా రెవెన్యూ కార్యాలయంలో మా చిన్నమ్మ పేరుపై అక్రమంగా విరాసత్ చేశారు.. నాకు చేయండి.'' అంటూ ఓ మహిళ ఉండవెల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. బాధితురాలి కథనం మేరకు.. ఉండవెల్లికి చెందిన మదర్సాబ్‌కు కంచుపాడు గ్రామ శివారులో 1.38 ఎకరాల ఇనామ్ భూమి ఉంది. అతడిని భార్య ఖాజాబి కొన్నేళ్ల క్రితం వదిలిపెట్టి వెళ్లిపోయింది. వారికి సంతానం లేకపోవడంతో వృద్ధాప్యంలో మదర్సాబ్ బాగోగులను అతడి అన్న కూతుళ్లు రిజ్వాన, రిహానా చూశారు. అందుకు ప్రతిఫలంగా మదర్సాబ్ తన పేరుపై ఉన్న భూమిని వారికి రాసిచ్చాడు. అతడు 2023లో మృతిచెందగా.. సదరు భూమిపై కోర్టులో కేసు కొనసాగుతుంది. ఈ క్రమంలోనే మదర్సాబ్ భార్య ఖాజాబి పేరుపై అధికారులు విరాసత్ చేశారు. ఈ విషయంపై బాధితురాలు తహసీల్దార్ ప్రభాకర్‌ను ప్రశ్నించారు. తన కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ ఒంటిపై పోసుకున్నారు. గమనించిన రెవెన్యూ సిబ్బందిని ఆమెను అడ్డుకొని కార్యాలయంలో నుంచి బయటికి పంపించారు. అయితే బాధిత మహిళ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ శేఖర్ అక్కడికి చేరుకొని ఆమెకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించింది. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. భూ వివాదం కోర్టులో ఉన్న విషయం తమకు తెలియదన్నారు. తమకు ప్రొసీడింగ్ ఇవ్వడంతో విరాసత్ చేసినట్లు చెప్పారు.

రాష్ట్ర కబడ్డీ జట్టు కెప్టెన్‌గా నల్లమల బిడ్డ



కందనూలు: తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టు కెప్టెన్‌గా అచ్చంపేట నియోజకవర్గం పదర గ్రామానికి చెందిన నందిని ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి జూలై 1వ తేదీ వరకు హరిద్వార్‌లో నిర్వహించే అండర్–18 జాతీయస్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారిణి నందిని తెలంగాణ జట్టు కెప్టెన్‌గా ఎంపిక కావడంపై డీవైఎస్‌ఓ సీతారాం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ కబడ్డీ పోటీలకు అరవింద్



మహబూబ్‌నగర్ క్రీడలు: ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఈనెల 28 నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు జరగనున్న మొదటి జాతీయస్థాయి అండర్–18 కబడ్డీ టోర్నమెంట్ జిల్లాలోని బాలానగర్ మండలం లింగారెడ్డిగూడకు చెందిన అరవింద్ ఎంపికయ్యాడు. తొలిసారిగా జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నాడు. అరవింద్ ఎంపికపై జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.శాంతికుమార్, కురుమూర్తిగౌడ్, ఉపాధ్యక్షులు దామోదర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయిలో ప్రతిభచాటాలని ఆకాంక్షించారు.

వనపర్తి జిల్లాకు చెందిన ఇద్దరు..


అంజి


వనపర్తి టౌన్: హైదరాబాద్‌లోని కాసాని వీరేశం అకాడమీ క్యాంపులో శిక్షణ పొందుతున్న పిల్లిగుండ్ల తండాకు చెందిన అనూషతో పాటు మూలమల్ల గ్రామానికి చెందిన అంజి జాతీయస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని వనపర్తి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వెంకట్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

జూరాలకు కృష్ణమ్మ పరవళ్లు

- 98 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. ప్రాజెక్టు 12 క్రస్టు గేట్ల ఎత్తివేత
- శ్రీశైలం ప్రాజెక్టులకు లక్ష క్యూసెక్కుల వరద

ధరూరు/ఆత్మకూరు/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు గురువారం రాత్రి 7 గంటలకు 98 వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు 12 క్రస్టు గేట్ల ద్వారా 73,998 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలోని ఎగువ, దిగువ 11 యూనిట్లలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నారు. ఇందుకోసం 27,461 క్యూసెక్కులు వినియోగించుకుంటున్నారు. కోయిల్ సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 43 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 550 క్యూసెక్కులు, కుడి కాల్వకు 290 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు.. ప్రాజెక్టు నుంచి మొత్తం 1,03,307 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.389 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా.. ఎగువ విద్యుత్ కేంద్రంలో 5 యూనిట్ల ద్వారా 61.621 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 70.393 ఎంయూ, మొత్తం 132.014 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు.

- జూరాల స్పిల్ వే, విద్యుదుత్పత్తి ద్వారా శ్రీశైలం ప్రాజెక్టుకు 1,01,459 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 863.1 అడుగుల నీటిమట్టంతో 115.7856 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,144 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.


జూరాల రిజర్వాయర్‌లో పూర్తి స్థాయి నీటి మట్టం

19 అడుగులకు కేఎస్పీ నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ నీటిమట్టం గురువారం సాయంత్రం వరకు 19 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు అలుగు స్థాయి 26.6 అడుగులు. అయితే ఈ నెల 1వ తేదీన 11 అడుగులుగా ఉండగా.. 26 రోజుల్లో 8 అడుగుల మేర పెరిగింది. జూరాలకు ఇన్‌ఫ్లో ప్రారంభం అయిన తరువాత కోయిల్ సాగర్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉంద్యాల ఫేస్ వన్ నుంచి ఒక పంపును రన్‌చేసి నీటిని విడుదల చేశారు. ఈనెల 6 వ తేదిన తీలేరు వద్ద ఉన్న ఫేస్ టు పంప్‌హౌస్ నుంచి ఒక పంపును రన్ చేసి నీటిని కోయిల్‌సాగర్‌కు వదిలారు. ఒక పంపు ద్వారా 315 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతోంది.

పురుడు పోసుకున్న అరుదైన సర్పం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జీవ వైవిధ్య పరిశోధన విద్యకేంద్రంలో గురువారం రాబ్డోఫీస్ ప్లంబికలర్ అనే అరుదైన విషపు రహిత సర్పం పురుడు పోసుకున్నట్లు బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య తెలిపారు. ఏప్రిల్ 30న మహబూబ్‌నగర్ వీరన్నపేటలోని ఒక ఇంట్లో పాము రాగా స్థానికుడు లోకేష్ చంపకుండా పట్టుకొని తమకు అప్పగించారని.. అదేరోజు రాత్రి 9 గుడ్లు పెట్టిందని వివరించారు. ఆ గుడ్లను బయో డైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో పొదగగా 6 పిల్లలు బయటకు వచ్చాయని.. సాధారణంగా ఈ పాములు ఆగస్టు, సెప్టెంబర్ నెలలోనే గుడ్లను పొదుగుతాయని, వాతావరణ మార్పులతో జూన్‌లోనే పొదిగిందన్నారు. పాము పిల్లల మెడలపై బాణం ఆకారంలో పసుపురంగు గుర్తులు.. కంటి నుంచి నోటి వరకు నలుపు రంగు చారలు ఉన్నాయని వివరించారు. రీసెర్చ్ సెంటర్‌లో ఉన్న అరకొర వసతుల నడుమ ఇప్పటికే పలుమార్లు పాములు పిల్లల్ని పొదగడం అనేక పరిశోధన కార్యక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు. పాము పిల్లలను అటవీ ప్రాంతంలో వదిలేయనున్నట్లు చెప్పారు.

'రుణాలే తీసుకోలే.. ఎలా చెల్లిస్తాం'


మాట్లాడుతున్న బ్యాంకు, డీఆర్‌డీఓ అధికారులు

మహమ్మదాబాద్: 'రుణాలే తీసుకోలే.. ఎలా చెల్లిస్తాం' అని మహిళా సంఘాల సభ్యులు డీఆర్‌డీఓ, బ్యాంక్ అధికారులతో తమ గోడు వెల్లబోసుకున్నారు. మండలంలోని మహి ళా సమాఖ్య సంఘాల నుంచి రుణాల రికవరీ లేకపోవడంతో గురువారం మహమ్మదాబాద్ మహిళా సమాఖ్య కార్యాలయంలో డీఆర్‌డీఓ ఏపీడీ శారద, ఏపీఎం సునీత, మహమ్మదాబాద్ ఎస్‌బీహెచ్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్లు కలిసి సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో వీఏఓలను, సీసీలు, ఇతర మహిళా సంఘాల సభ్యులను పిలిపించి మాట్లాడారు. రుణాలు ఎందుకు చెల్లించడం లేదని సభ్యులను ప్రశ్నించారు. సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ తాము తీసుకోని రుణాలను ఎందుకు చెల్లిస్తామని ప్రశ్నించారు. కొందరు వీఏఓలు తమకు తెలియకుండా రుణాలు తీసుకున్నట్లు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వచ్చే నెల వరకు పూర్తిస్థాయిలో రికవరీ చేయాలని, అక్రమాలు బయటపడితే చర్యలు తీసుకుంటామని, అందుకు బాధ్యులయిన వారిని తొలగిస్తామని ఏపీడీ శారద హెచ్చరించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా


రోడ్డుపై బోల్తా పడిన ట్రావెల్స్ బస్సు

దోమలపెంట: హైదరాబాద్, శ్రీశైలం ప్రధాన రహదారిలో గురువారం ప్రమాదవశాత్తు ప్రైవేట్ బస్సు బోల్తా పడిన ఘటన దోమలపెంటలో చోటుచేసుకుంది. ఈగలపెంట ఏఎస్ఐ బాలునాయక్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా జనగాం కు చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు జనగాం నుంచి శ్రీశైలానికి వస్తుండగా అమ్రాబాద్ మండలంలోని దోమలపెంటలో శ్రీశైలం ప్రధాన రహదారిలో బ్రేకులు ఫెలయి బోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ సమయంలో డ్రైవర్ తుమ్మల సురేష్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. బస్సులో 11 మంది చిన్నారులతో సహ 40 మంది ఉన్నారని తెలిపారు. క్షతగాత్రులను కటకం రాములమ్మ ఫౌండేషన్ అంబులెన్స్‌లో జెన్‌కో ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. బస్సు ఓ కారును సైతం ఢీకొట్టడంతో కారు వెనక అద్దాలు ధ్వంసమయ్యాయి. రోడ్డు దాటుతున్న ఓ ఆవుకు సైతం తగలడంతో దానికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కంటైనర్ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు


పాలెం సమీపంలో బోల్తా పడిన కంటైనర్

కొత్తకోట రూరల్: ఐరన్ లోడ్‌తో వెళ్తున్న కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న కంటైనర్ వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం సమీపంలో డ్రైవర్ షాహీర్ అజాగ్రత్త కారణంగా జాతీయ రహదారి 44పై అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ వాహనంలో డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఆనంద్ తెలిపారు.